## క్లుప్తంగా

### నేడు 'డయల్ యువర్ డీఎం'

**నర్సంపేట:** నర్సంపేట ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ విజయమాధురి గురువారం తెలిపారు. డిపో పరిధిలోని నర్సంపేట, చెన్నారావుపేట, గూడూరు, కొత్తగూడ, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల పరిధిలోని ప్రజలు సమస్యలతోపాటు సలహాలు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. వివరాలకు 99592 26052 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

### క్షమాపణ చెప్పాలి



**చెన్నారావుపేట :** ఛత్రపతి శివాజీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన లింగంపల్లి కిషన్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కొడగాని రాజీరు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని కోనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతికి అవమానంగా జరిగే విధంగా కిషన్‌రావు మాట్లాడటం సరికాదన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు గుజ్జుల బాబురావు, అంబీరు వీరన్న, దౌతపురపు శంకర్‌రావు, బక్కయ్య, లక్ష్మణ్‌రావు, రాజేశ్వర్‌రావు, బుచ్చిబాబు, మోహన్‌రావు ఉన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

**వరంగల్ (పర్వతగిరి) :** మండలంలోని కల్లెడ కాశీవిశ్వేరస్వామి దేవాలయంలో ఇటీవల నిర్వహించిన బ్రహోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు సంపెల్లి పరమేశ్వర్‌రావు, ఆలయ నిర్మాణకర్త ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రథమ సంవత్సరాన్ని పురస్కరించుకొని బ్రహోత్సవాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

### చర్య తీసుకోవాలి

**నర్సంపేట :** ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మిస్తుంటే అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పెండెం శివానంద్‌తో పాటు కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు భూ ఆక్రమణ చేపట్టిన వ్యక్తిపై తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కండేయ కాలనీలోని సర్వే నంబర్ 111/32లో పది గుంటల స్థలాన్ని ఈక నారాయణ అనే వ్యక్తి ఆక్రమించాడని తెలిపారు. 1998లో 7ఎకరాల 19గుంటలతో భూ బదలాయింపు చట్టం ప్రకారం స్థలాన్ని పద్మశాలీ కులస్తులకు పట్టాలు అందించారని తెలిపారు.

### పాఠశాల తనిఖీ

**వరంగల్ (పర్వతగిరి) :** మండలంలోని విశ్వభారతి హైస్కూల్‌ను గురువారం ఎంఈఓ చదువుల సత్యానారాయణ తనిఖీ చేశారు. పాఠశాలలో మౌళిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలపై ఎంఈఓ పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, పాఠశాల కరస్పాండెంట్ బైరి భూమాత ఉన్నారు.

### ఎస్ఏఈపై అవగాహన

**నర్సంపేట రూరల్ :** నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఏఈ (సోషల్ ఫర్ ఆటోమెటివ్ ఇంజనీర్స్)పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### జీవాలను కాపాడుకోవాలి



**నెక్కొండ :** గొర్రెలు, మేకల పెంపకందారులు వైద్యుల సూచనలు పాటించి జీవాలను కంటికి రెప్పాలా కాపాడుకోవాలని నెక్కొండ పశువైద్యాధికారి మమత సూచించారు. మండల పశువైద్య కేంద్రం పరిధిలోని పనికర, రామన్నకుంట తండా, గొల్లపల్లి, చంద్రుగొండ, బంజరుపల్లి గ్రామాల్లో గురువారం పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును వేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది మొగిలి, యాదగిరి, పశుమిత్ర చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

**చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన కుండె అరుంధతి ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్తున్న సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ మిత్రులు గురువారం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే కేసీఆర్ ధ్యేయం



దుగ్గొండి: రోడ్డు పనులప్రారంభోత్సవంలో ఆకుల శ్రీనివాస్



నల్లబెల్లి: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

**జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న**

**నల్లబెల్లి :** గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. ఈ మేరకు మండలంలోని గుండ్లపాహాడ్‌లో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ఊడుగుల సునీతతో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గందె శ్రీలత, సర్పంచ్ కదురు కట్టయ్య, ఎంపీటీసీ లక్ష్మి, ఉపసర్పంచ్ రంజిత్, నాయకులు బైరు పాక సుధాకర్, కొండోజు వెంకన్న, చింత కొంరెల్లి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**దుగ్గొండి :** మండలంలోని చలపర్తి గ్రామ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల గురువారం ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారన్నారు. అభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ నర్సంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన ఘనత పెద్దికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాట్ల భద్రయ్య, సుకినె రాజేశ్వర్‌రావు, పొన్నం మొగిలి, సర్పంచ్ ముదరకోల శారద, ఎంపీటీసీ సోనిరతన్, కృష్ణ, కోటగిరి భాస్కర్, పులి కావ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : చంద్రయ్యపల్లిలో..

### చంద్రయ్యపల్లిలో..

**నర్సంపేట రూరల్ :** నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బరిగెల లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్ రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, బాషబోయిన శ్రీనివాస్, సర్పంచ్ యువరాజు, వార్డు సభ్యులు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలకు క్రీడా పోటీలు

**నర్సంపేట :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు క్రీడలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27నుంచి మండల కేంద్రంలో ప్రారంభమై మార్చి 5న నర్సంపేట పట్టణంలో డివిజన్ స్థాయి క్రీడలు ముగియనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే మహిళలు ఆయా మండల కేంద్రాల్లో మండల సమాఖ్య కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

## నివాళి



భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

**నర్సంపేట రూరల్ :** నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటకు చెందిన మండ చిన్న భద్రయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం గౌడ జనహక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్‌గౌడ్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాచర్ల ఐలుమల్లు, సురేందర్, పొగాకు కుమారస్వామి, మండల మహేందర్‌గౌడ్, అరెల్లి వేణుగౌడ్, బూర సుమన్, పీఏసీఎస్ చైర్మన్ మోరాల మోహన్‌రెడ్డి, గంగిడి సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం పథకాలు అందేలా చూడాలి



నర్సంపేట: మాట్లాడుతున్న రజనిభారతి



గీసుకొండ: మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

**నర్సంపేట :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా బీజేపీ నాయకులు చూడాలని మాజీ సర్పంచ్ చిలువేరు రజనిభారతి అన్నారు. ఈ మేరకు పట్టణంలో ప్రజా గోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలో రైతులంతా సుఖంగా ఉంటేనే దేశ ప్రజలు సుఖంగా ఉంటారని తలచి రైతులకు గిట్టుబాటు ధర, యూరియా, పొటాష్, పంట నష్టపరిహారం, ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తోందని తెలిపారు. దేశంలో వైద్యం వ్యాపారం అవుతున్న వేళ పేదలందరికి ఆయుష్మాన్ భారత్ ప్రవేశపెట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా 18సంవత్సరాల నుంచి 70సంవత్సరాల వరకు కేవలం రూ.12లు చెల్లిస్తే చాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు, అంగవైకల్యానికి రూ.లక్ష వరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, శీలం సత్యనారాయణ, గూడూరు సందీప్, సామల ప్రవీణ్‌కుమార్, చింతల విజయరాణి, రంజిత్, కందగట్ల నాగరాజు, కోమాండ్ల సప్తగిరి, పప్పు రాజు, కండగట్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

### 'బీజేపీ జెండా ఎగరడం ఖాయం'

**గీసుకొండ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, ప్రతీ కార్యకర్త, నాయకుడు కష్టపడి పని చేయాలని పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలచర్లలో స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేశ్, నాయకులు కూనమల్ల రవి, బండారి సదానందం, మల్లికార్జున్, లెంకలపెల్లి స్వామి, కామగోని రఘుపతి, బత్తుల అశోక్, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మార్నేని రవీందర్‌రావు

**వర్ధన్నపేట :** మండలంలోని బండౌతపురం గ్రామ ఎంపీటీసీ మరుపట్ల సురేష్ తాత అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కాగా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి. ల్యాబర్తి ఎంపీటీసీ అన్నమనేని ఉమ తదితరులు ఉన్నారు.

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటకు సోకిన తెగులును వివరిస్తున్న ఏఓ

**వర్ధన్నపేట :** మొక్కజొన్న పంటకు చీడ పీడలు ఆశించాయని నివారణ చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఏఓ రాంనర్సయ్య రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కట్య్రాలలో మొక్కజొన్న పంటక్షేత్రాలను సందర్శించారు. మొక్కజొన్న పంటల్లో చీడ పీడలు, తెగుళ్లను గుర్తించడం జరిగిందని నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆకుమాడు తెగులు, కత్తెర పురుగు ఆశించాయన్నారు. ఆకు మాడు తెగులు నివారణకు ట్రాఫిక్ కోనోఎజోల్ 2 మిలీ 1 లీటరు నీటికి లేదా డైపెన్ క్రోనోజోల్ 0.5 మిలీ 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్ క్లోరైడ్ 3 గ్రా 1 లీటరు నీటికి కలిపి మొక్క మొదలు వేర్లు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. యామామెట్ బెంజోయెట్ 0.5 గ్రా లేదా కొరజిన్ 1.5 మి.లీ..ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వేపనూనె పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు.

## మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ




శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజని

**నర్సంపేట :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ అన్నారు. ఈ మేరకు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో చాయ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నిరుపేద మహిళలకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంపొందించుకొని జీవనోపాధికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. తద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జుర్రు రాజు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఖాజీనౌమాన్, కోట డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**గీసుకొండ :** పరకాల నియోజకవర్గంలోని గీసుకొండ, సంగెం, గ్రేటర్ వరంగల్ నగరంలోని 39మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పంపిణీ చేశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఊకల్ సొసైటీ డైరెక్టర్ చిన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### కారును ఢీ కొట్టిన లారీ

**ఖానాపురం :** మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు లారీ, కారును ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో టేకులతండా నుంచి కారు హైవే పైకి వస్తుంది. ఈ క్రమంలో మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

### గుండెపోటుతో వ్యక్తి మృతి

**చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన మహ్మద్ యాకూబ్ పాషా(36) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ మండల నాయకుడు కంది కృష్ణ చైతన్యరెడ్డి, నయాబ్ తహసీల్దార్ మధుసూదన్ పాషా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీకో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మెట్ట యాదగిరి, మూడు రమేష్, సుమన్, సన్నీ, నర్మెట్ట సాంబయ్య, యాకూబ్, కిరణ్, ఉప్పలయ్య, బర్ల దేవదాసు, కందిక సునీల్, రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

**వర్ధన్నపేట :** రోడ్డుపై నిలబడి ఉన్న ఓ వృద్ధుడిని బైక్ ఢీ కొట్టడంతో గాయాలైన సంఘటన గురువారం ఇల్లందలో చోటుచేసుకుంది. రాయపర్తి మండలం కొండూరుకు చెందిన సత్తార్ అనే వృద్ధుడు బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరై తిరిగి తన ఆక్టీవా బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి పైకి రాగానే ఎదురుగా అతి వేగంతో బైక్‌పై యువకులు వస్తుండగా వెంటనే తన ఆక్టీవా వాహనాన్ని పక్కకు నిలిపాడు. బైక్ అతి వేగంతో వస్తూ అదుపు తప్పి సత్తార్‌ను ఢీ కొట్టడంతో కాలుకు తీవ్ర గాయమై పడిపోయాడు. బైక్ అక్కడే వదిలేసి యువకులు పారిపోయారు. వెంటనే స్థానికులు సత్తార్‌ను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

# రిజర్వాయర్ నుంచి నీరు లీకేజీ



**వరంగల్ (పర్వతగిరి) :** పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్ పనులను టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.6కోట్లతో మొదటి దఫా పనులను చేపట్టారు. మొదటి దఫా పునరుద్ధరణ పనుల్లో భాగంగా రిజర్వాయర్‌కు ఎడమ వైపున సిమెంటుతో చెక్ డ్యాం నిర్మించారు. కాగా అప్పుడు చేసిన పనుల కారణంగా లీకేజి జరుగుతున్నాయి. రెండో దఫా చేసిన పనుల్లో భాగంగా నీరు ఎక్కువగా నిల్వ ఉండడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేయకపోతే పెద్ద చెరువుకు గండి పడే అవకాశం ఉంది.

# ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్

**చెన్నారావుపేట :** ప్రభుత్వ ఆస్పత్రికి కమిటీ సభ్యులు సహకరించాలని జిల్లా ఉప వైద్యాధికారి ప్రకాష్ అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం రూ.89వేలు మంజూరయ్యాయని అన్నారు. వాటితో చేయాల్సిన అభివృద్ధి పనులపై కమిటీ ఆధ్వర్యంలో తీర్మానాలు చేశామని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సరోజ, ఎంపీడీఓ భారతి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుండె మల్లయ్య, ప్రేమలత, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, సిబ్బంది ఉన్నారు.

# పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఖానాపురం :** మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రదీప్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మన ఊరు-మన బడి పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ప్రతీ పాఠశాలలో పనులను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సుమనవాణి, ఏఈ శోభన్, నోడల్ ఆఫీసర్ మంగ్యా తదితరులు పాల్గొన్నారు. ముందుగా అశోక్‌నగర్, బుధరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పరిశీలించారు. అలాగే పాకాల ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న పంటలకు పూర్తిస్థాయిలో నీరందిస్తామని ఎంపీపీ ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు పాకాల ఆయకట్టు పరిధిలో పంట కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

# నిందితుడిని కఠినంగా శిక్షించాలి




నర్సంపేట పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**నర్సంపేట :** వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, ఏబీఎస్ఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై రోజు రోజుకు అఘాయిత్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. షీ టీంలను తీసుకువచ్చామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం అమలు తీరుపై నిర్లక్ష్యం చేయడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఫరీదా, కలకోటి అనిల్, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, గణేష్, రాహుల్, రాజేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### కేఎంసీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థిని ప్రీతి ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి కేఎంసీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బోడ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనకు కారకులైన సీనియర్లపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, మెడికల్ డిగ్రీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, ఎంజీఎం సూపరింటెండెంట్‌లను సస్పెండ్ చేయాలని అన్నారు. కేఎంసీలో వరుస ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని కోరారు.

# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**నల్లబెల్లి :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ ఊడుగుల సునీత అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్-2 శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంపీపీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించుకునేల అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా తగ్గించాలన్నారు. ఈ తడి, పొడి చెత్తను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ కుమార్, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్స్ శ్రీనివాసరావు, టీఓటీ ట్రైనర్స్ శ్రీనివాసులు, శ్రీధర్, సురేష్, రాజు, కుమార్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్, వీఓఏలు పాల్గొన్నారు.

# కోతులతో మొక్కజొన్న పంటకు నష్టం

**వర్ధన్నపేట :** ఆరుగాలం శ్రమించే రైతులకు కష్టకాలం దాపురించింది.. ఎక్కువ వర్షాలు వస్తే.. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, చీడ పీడలు ఇందులో ఏది వచ్చినా నోటికాడికి వచ్చే బువ్వ చేజారిపోతుంది. వీటన్నింటికి తోడు వానరాల దాడులు విపరీతంగా పెరగడంతో వేసిన పంటలు చేతికి వచ్చే నమ్మకం లేకుండా పోతోంది. వర్ధన్నపేట మండలంలో యాసంగి సీజన్‌లో 1,650 ఎకరాల మొక్క జొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో చీడ పీడలకు తోడు కోతుల బెడద పెద్ద కష్టంగా మారింది. వర్ధన్నపేట పట్టణ శివారులోని నీలగిరిస్వామి తండాకు చెందిన బానోతు హుసేన్ తన కున్న మూడెకరాల్లో మొక్కజొన్న పంటను వేశాడు. పంట చేతికొచ్చే సమయంలో కోతుల మందలు వచ్చి చేనుపై దాడి చేసి కంకులను ఛిన్నాభిన్నం చేస్తున్నాయని పంటకు రక్షణగా చేను చుట్టూ జాలీ ఏర్పాటు చేశాడు. అయినా కోతుల మందలు వందలాది వచ్చి జాలీని సైతం ఎక్కడికక్కడ చించేసి కిష్కింద కాండ నిర్వహిస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలు పోని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దాదాపు మండలంలో మొక్కజొన్న వేసిన ప్రతి రైతు కోతుల దాడుల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నా సాధ్యం కావడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు కోతుల బెడద నుంచి రక్షణ కల్పించి పంట నష్టపోకుండా చూడాలని వేడుకుంటున్నారు.



మొక్కజొన్న పంట

### పంటకు రక్షణ కల్పించాలి



ఎంతో కష్టపడి మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. ఏపుగా పెరిగి కంకులు బాగా వస్తున్నాయి. ఈ క్రమంలో కంకులకు గింజలు వస్తున్న సమయంలోనే కోతులు రాత్రనక, పగలనక మాకు నిద్ర లేకుండా చేస్తూ పంట నష్టం కలిగిస్తున్నాయి, కోతుల బారి నుంచి పంటలకు రక్షణ కల్పించాలి.

**- బానోత్ హుసేన్ నాయక్, నీలగిరిస్వామి తండా**